ప్రాణమున్నంత వరకు కేసీఆర్‌తోనే ఉంటా..

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

- అసత్య ప్రచారం నమ్మవద్దు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, డిసెంబర్ 12: ప్రాణమున్నంత వరకు కేసీఆర్‌తోనే ఉంటానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారిగా కమలాపూర్‌కు రావడంతో పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు కౌశిక్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లోకి వెళ్తానని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను వీడేదిలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. తన మీద నమ్మకంతో గెలిపించిన ప్రజల కోసం పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రైతుబంధుతో పాటు బోనస్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి, జడ్పీటీసీ కల్యాణి, సర్పంచ్ కట్కూరి విజయ, సింగిల్ విండో చైర్మన్ సంపత్‌రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేత

ధర్మసాగర్, డిసెంబర్ 12 : మండలంలోని దేవునూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుడివెనుక దేవేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని పలువురు నాయకులు కలిశారు. కడియం ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అధ్యక్షుడు డీ యాదగిరి, రైతు కోఆర్డినేటర్ ఇంగే రవీందర్, వార్డు సభ్యుడు రాంపాక రాజు, మండల యూత్ ఉపాధ్యక్షుడు బోళ్ల భరత్, మండల నాయకులు రాంబాబు, శశి, మహేందర్, పవన్, వంశీ, పలువురు యూత్ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేయూలో సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: ఈనెల 16న విశ్వవిద్యాలయ కామర్స్ కాలేజీ సెమినార్‌హాల్‌లో కామర్స్ ప్రొఫెసర్లకు 'రీసెర్చ్ మెథడాలజీ అండ్ రిపోర్ట్ రైటింగ్'పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వీసీ రమేశ్ తెలిపారు. మంగళవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్లు రిజిస్ట్రార్ శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నరసింహచారి, పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు రాజేందర్, కృష్ణమాచారి, ఒప్పంద అధ్యాపకులు కటకం ఫణీంద్ర, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

యూనివర్సిటీని సందర్శించిన లాసజోల్ సజ్జదోస్

కాకతీయ విశ్వవిద్యాలయ బయో టెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ సదానందం, డాక్టర్ శాస్త్రితో ఉన్న అవగాహన ఒప్పందంలో భాగంగా యూరోపియన్ యూనియన్, హంగేరి నగరంలో ఇనిస్టిట్యూట్ అఫ్ ప్లాంట్ బయోటెక్నాలజీ, బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్ గ్రూప్ లీడర్ లాసజోల్ సజ్జదోస్ కేయూ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బొటానికల్ రంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, కొలాబరేషన్‌తో ఉన్న ఉపయోగాలు వివరించారు. వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, రామస్వామి, మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సదానందం, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సురేశ్‌లాల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జీజేసీ విద్యార్థులు

హనుమకొండ సిటీ, డిసెంబర్12 : జాతీయ స్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ధర్మేంద్ర తెలిపారు. హనుమకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో జీ అనూష బంగారు, రజత పతకాలు, ఆర్ వేణు ఏడు బంగారు పతకాలు, ఆర్ వర్షిత్ రెండు బంగారు, ఒక రజత పతకం, టీ జీవన్ కుమార్ రెండు బంగారు, ఒక వెండి పతకం, బీ ప్రహాషిక ఒక బంగారు, మూడు రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఈనెల ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. మంగళవారం కళాశాల ఆవరణలో విద్యార్థులను అభినందించి, అధ్యాపకులతో కలిసి ఆర్థిక సాయం అందించారు. అధ్యాపకులు శ్రీనువాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: కేయూ విశ్రాంత బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో ఈనెల 20న కామర్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ బాధ్యులు ఎన్ సంజీవరావు, ఏ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఎస్ గిద్యోను, లక్ష్మిరెడ్డి, మహ్మద్ అక్తర్ పాల్గొన్నారు.

'రైతు బంధు' ఖాతాల్లో జమ

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 12 : రైతుబంధు పథకంలో భాగంగా పాత పద్ధతిలోనే అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని రైతులకు తొలిరోజు ఎకరంలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు డబ్బులు ఖాతాలో జమ అయినట్లు ఫోన్లకు సమచారం వచ్చింది. జిల్లాలో లక్షా 52 వేల మంది రైతులు అర్హులుగా ఉండగా, తొలి రోజు 58,286 మంది రైతులకు డబ్బులు జమయ్యాయి.

'నిబంధనల ప్రకారమే ఇల్లు నిర్మించుకున్నాం'

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: ఒరిజినల్ డాక్యుమెంట్లతో నిబంధనలకు లోబడి ఇల్లు నిర్మించుకున్నామని, తమపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన సులోచన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11వ తేదీన ఓ ప్రధాన పత్రికలో తమ ఇంటి నిర్మాణంపై తప్పుడు వార్తను ప్రచురించారని, ఇంటికి సంబంధించిన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లతో విచారణకు తాను సిద్ధమని తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మల్లికుదుర్ల గ్రామస్తులు

వేలేరు, డిసెంబర్ 12 : మండలంలోని మల్లికుదుర్ల గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి చెందిన భట్టు రామన్న, మరి కొంత మంది కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లికుదర్లలోని వైకుంఠధామం పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో గతంలో ప్రభుత్వం లక్షలు వెచ్చించి చెట్లను పెంచిందన్నారు. ఓ వ్యక్తి ఇప్పుడు ఆ భూమి తనదేనని ఆ స్థలంలో ఉన్న చెట్లను నరికి అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. ఆ ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కానీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిట్‌లో హైడ్రోలాజిక్ మానిటరింగ్‌పై సదస్సు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: నిట్‌లో 'వాటర్ షెడ్‌ల అడ్వాన్స్‌లలో హైడ్రోలాజిక్ మానిటరింగ్' అనే అంశంపై రెండు వారాల సదస్సు నిర్వహించారు. టెనస్సీ టెక్నాలాజికల్ యూనివర్సిటీ సివిల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఆల్‌ఫ్రెడ్ ప్రారంభించారు. ప్రారంభ సమావేశంలో కే వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ మనాలిపాల్, వీ వంశీకృష్ణ పాల్గొన్నారు. హైడ్రోలాజిక్ మానిటరింగ్ రంగంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి వర్క్ షాప్ ఒక వేదికగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

వర్షిత్

సాత్విక

ధర్మసాగర్/వర్ధన్నపేట, డిసెంబర్ 12 : మండలంలోని పెద్దపెండ్యాల జడ్పీ పాఠశాల విద్యార్థి బచ్చలకూరి వర్షిత్, వర్ధన్నపేట మండలం ఇల్లంద ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సాత్విక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎంలు బత్తిని రాజేందర్, మునిగాల విజయ మంగళవారం వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 11న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు నారాయణపేటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను పీఈటీ సుధాకర్, సర్పంచ్ ఏ అన్నమ్మ, ఉప సర్పంచ్ శివాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తోట ప్రవంతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తోట నాగరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ మామిడాల కిశోర్, హెచ్ఎం చాడ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సీపీని కలిసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

సీపీకి మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సుబేదారి, డిసెంబర్12: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సీపీ అంబర్ కిశోర్ ఝాను మంగళవారం కలిశారు. నాగరాజు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ఆయన హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిశారు. ఈ సందర్భంగా సీపీని శాలువాతో సన్మానించి పూలమొక్క అందజేశారు. ఎమ్మెల్యే నాగరాజును సీపీ అభినందించారు.

విద్యార్థులు సమాజ సేవ చేయాలి

ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: విద్యార్థులు సమాజసేవ కోసం పాటుపడాలని కేయూ ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడవాలన్నారు. మంగళవారం కేయూ ఫార్మసి కాలేజీలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్‌లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సునీత, శశిధర్, సుజాత, మాధురి, ప్రియాంక, అనూష, కావ్యశ్రీ, చంద్రిక, లక్ష్మి, లావణ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక సబ్ రిజిస్ట్రార్‌గా కార్తీక్

హనుమకొండ, డిసెంబర్ 12: రిజిస్ట్రార్ ఆఫీస్ వరంగల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్ రాజు నెలాఖరు వరకు సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో అదే కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ కార్తీక్‌ను తాత్కాలిక సబ్ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఉత్తర్వులు జారీ చేశారు. రాజు విధుల్లో చేరే వరకు కార్తీక్ తాత్కాలిక సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించనున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఐనవోలు, డిసెంబర్ 12: మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బొక్కల ఉప్పలమ్మ సోమవారం మృతి చెందింది. అభయ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం ఉప్పలమ్మ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వారి వెంట సర్పంచ్‌లు కట్కూరి రాజమణి, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉసిరికాయల అలంకరణలో సిద్ధేశ్వరుడు

ఉసిరికాయలతో అలంకరించిన సిద్ధేశ్వరుడు

హనుమకొండ, డిసెంబర్ 12 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని సిద్ధేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమావాస్య తిథి సందర్భంగా సిద్ధేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు రవికుమార్, సురేశ్‌కుమార్ తెలిపారు. స్వామివారిని ఉసిరికాయలతో అలంకరించారు. కార్తీక మాసం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం

మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌ని వరంగల్ డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోడిపాక గణేశ్‌కుమార్, వర్ధన్నపేట ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రేపల్లె శ్రీనాథ్, కాంగ్రెస్ యూత్ నాయకుడు రేపల్లె రంగనాథ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మల్లికుదుర్ల విద్యార్థులు

వేలేరు, డిసెంబర్ 12 : మండలంలోని మల్లికుదుర్ల జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కే జయసాగర్, పీఈటీ సుమలత తెలిపారు. విద్యార్థులు కీర్తి, శ్వేత, గగిల్లా షాలిని, మోడెం రుషి, మోడెం రోహిత్, కీర్తి సాయికిరణ్ అండర్-14, 17 బాల, బాలికల విభాగంలో ఈ నెల 4న మహబూబాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను మంగళవారం హెచ్ఎం కే జయసాగర్, ఉపాధ్యాయులు, జడ్పీటీసీ సరితరెడ్డి, సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు అభినందించారు.

గ్రామాల్లో చదువుల పండుగ

భీమదేవరపల్లి, డిసెంబర్ 12: మండల క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని మంగళవారం సీఆర్పీ ఎల్కపల్లి శ్రీకాంత్ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ మార్పాటి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.